హామీలకే పరిమితం!

మూడు నెలల క్రితం జరిగిన ఎన్నికల సమయంలో కూటమి నాయకులు లేనిపోని హామీలతో ప్రజల ముందుకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. వీరి మాటలను నమ్మిన ఓటర్లు వారికి పట్టం కట్టారు. అయితే పాలనా పగ్గాలు చేపట్టి వంద రోజులైన ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. కనీసం వాటి ప్రస్తావన కూడా తీసురావడం లేదు. దీంతో ప్రజలు ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు ఏమి చేశారని వంద రోజుల పండుగ చేసుకుంటున్నారని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటున్నారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న వంశధార రిజర్వాయర్

పాతపట్నం





ఐటీడీఏ ఏర్పాటు ఏమైంది?

ఎల్.ఎన్.పేట: పాతపట్నం ఎమ్మెల్యేగా గెలిచిన మామిడి గోవిందరావు 2024 ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. అయితే ఒక్కటి కూడా నెరవేరకపోవడంతో ఎన్నికల ముందు అనేక ప్రచార సభల్లోను, రోడ్డు షోల్లోను, మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయన ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

- వంశధార నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. ప్రాజెక్టు పనులు సైతం పూర్తి చేస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు నిర్వాసితులకు ఏమి చేస్తారో తెలియని దుస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తీసుకుని రాలేదు.
- జిల్లా పునర్విభజన తరువాత ఈ ప్రాంత గిరిజనులకు అన్యాయం జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారని.. వారికి అందుబాటులోకి పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వంద రోజులైనా దీని ప్రస్తావన లేదు. దీంతో ఐటీడీఏ ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కానీ దీని గురించి అసలు ఎక్కడా ప్రయత్నం కూడా చేయలేదు. అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు ఎప్పుడు అవుతుందా? అని ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.
- పాతపట్నంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు, గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధి గురించి కూడా హామీ ఇచ్చారు. కానీ ఏ ఒక్కటి కార్యరూపం దాల్చలేదు.

నరసన్నపేట: అభివృద్ధికి నోచుకోని రాజుల చెరువు

నరసన్నపేట





చేసింది శూన్యమే..

నరసన్నపేట: నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదు.

- జలుమూరు, సారవకోట, నరసన్నపేట, పోలాకి మండలాల్లోని ప్రతీ గ్రామానికి మంచినీటిని అందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
- నరసన్నపేటలోని రాజుల చెరువును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.
- ఇండోర్ స్టేడియాన్ని తొందరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.
- మడపాం, కామేశ్వరిపేటల వద్ద ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని చెప్పుకొచ్చారు.
- పోలాకి మండలంలో తంపర భూముల సమస్యను పరిష్కరించి ఈ భూములకు శాశ్వతంగా ముంపునుంచి రక్షిస్తానని చెప్పారు.
- సారవకోట మండలంలో బొంతు ఎత్తిపోల పథకం పనులు తొందరగా ప్రారంభించి పూర్తి చేస్తానని హామీ నిచ్చారు.
- గుమ్మపాడు పంచాయతీలోని ఆశోకం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.
- వనిత–గార మధ్య వంశధార నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన పనులు ప్రారంభించి పూర్తిచేస్తామన్నారు. కానీ ఒక్క హామీ కూడా నెరవేరలేదు.

వంశధార–నాగావళి నదుల అనుసంధానం కోసం సరుబుజ్జిలి మండలం చిగురువలస వద్ద గతంలో నిర్మాణ చేసిన హైలెవెల్ కెనాల్

ఆమదాలవలస





నదుల అనుసంధానం ఎక్కడ?

ఆమదాలవలస: ఎన్నికల సమయంలో ఆమదాలవలసలో ప్రజాగళంపేరుతో నిర్వహించిన సమావేశంలో కూటమి నాయకులతోపాటు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ లేనిపోని హామీలిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజల పాలన పూర్తయిన ఒక్కటి కూడా నెరవేరలేదని జనం మండిపండుతున్నారు.

- వంశధార–నాగావళి నదులు అనుసంధానం చేస్తూ సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మండలాల్లోని ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే దీన్ని ఎమ్మెల్యే మరిచిపోయారు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నియోజకవర్గంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. దాని ఊసే లేదు.
- సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం వద్ద అటు నరసన్నపేట మండలంలో కొన్ని గ్రామాలను కలుపుతూ వంశధార నదిపై వంతెన నిర్మాణం చేపడతామన్నారు.
- నాగావళి నదిపై ఆమదాలవలస మండలం ముద్దాడపేట వద్ద పొందూరు మండలాన్ని కలుపుతు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.
- బూర్జ మండలంలో నారాయణపురం ఆనకట్టు ఆధునీకరణ పనులు కొలిక్కి తీసుకువస్తామని స్వయాన చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు.
- ఆమదాలవలస–శ్రీకాకుళం రోడ్ నిర్మాణ పనులు అధికారంలోకి వచ్చిన వెంటనే చేస్తామన్నారు.
- పొందూరు మండలంలోని రెల్లిగెడ్డను అభివృద్ధి చేస్తామని చెప్పారు.
- పొందూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం నిర్మాణం చేపడతామన్నారు.
- వంశధార ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు.
- వీటిలో ఒక్కటి కూడా నెరవేరలేదు.

క్లుప్తంగా

కేజీబీవీ సందర్శన



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న చైర్మన్ నాగమణి

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని కేజీబీవీని చైర్మన్ కాగాన నాగమణి శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వండి వడ్డించాలని సిబ్బందికి సూచించారు. కేజీబీవీ ఎస్‌వో ఎం.వి.అంబిక, వైస్ చైర్మన్ తూలుగు కృష్ణ, కమిటీ సభ్యులు భారతి ఉన్నారు.

93 మద్యం బాటిళ్ల స్వాధీనం



పట్టుబడిన మద్యం బ్యాటిళ్లు

పాతపట్నం: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై లావణ్య చెప్పారు. కొరసవాడ గ్రామ సమీపంలో శుక్రవారం తనిఖీలు చేపడుతుండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా 93 మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడినట్టు తెలిపారు. పట్టుబడిన మద్యం బ్యాటిళ్ల విలువ రూ.16,560 ఉంటుందన్నారు. పట్టుబడిన వ్యకిని అరెస్టు చేసి పాతపట్నం కోర్టులో ప్రవేశ పెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై చెప్పారు.

చెడు వ్యసనాలకు బానిసకావద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎంఏ అహ్మద్

కొత్తూరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిక కావొద్దని స్థానిక ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ అన్నారు. స్థానిక ఏకలవ్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసైతే నిండు జీవితం అంధకారం అవుతోందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చెప్పారు. మండలంలోని మెట్టూరులో వాహన తనిఖీలను నిర్వహించిన అనంతరం రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ఆమదాలవలస: పేదలకు ఆసరాగా అన్ క్యాంటీన్లు నిలుస్తున్నాయని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఐదు రూపాయలకు అన్నం, టిఫిన్ అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తమ్మినేని విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, ఎస్.ఢిల్లేశ్వరరావు, నూక రాజు, కొండబాబు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు



మృతుని భార్యకు ఎక్స్‌గ్రేషియా పత్రం అందజేస్తున్న దృశ్యం

సారవకోట: అడ్డపనస గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఈ ఏడాది జనవరిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. దీనికి సంబంధించిన పత్రాలను ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు శుక్రవారం గుమ్మపాడు సచివాలయంలో మృతుని భార్యకు అందజేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ రాంబాబు, ఏపీఓ నారాయణరావు, మాజీ సర్పంచ్ కత్తిరి వెంకటరమణ ఉన్నారు.

చిన్నారుల విరాళాల సేకరణ స్ఫూర్తిదాయకం

ఆమదాలవలస: ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలన్న ఆలోచనతో పట్టణంలోని భవిత స్కూల్ చిన్నారులు పెద్ద మొత్తంలో విరాళాలు సేకరించడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం పాఠశాల చిన్నారులు సేకరించిన విరాళం రూ.30 వేల డీడీని శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే రవికుమార్‌కు యాజమాన్య ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారులను శాసనసభ్యుడు అభినందించారు.

వందరోజుల్లో..

ఒక్క హామీ అమలు కాలేదు



మాట్లాడుతున్న రెడ్డి శాంతి

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అర చేతిలో వైకుంఠం అంటే ఏమిటో తెలియాలంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వ పరిపాలన చూస్తే అర్థం అవుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆమె మాట్లాడారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనప్పటికీ ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం ఆచరణకు సాధ్యం కానీ లేనిపోని హామీలిచ్చారని గుర్తు చేశారు. సూపర్‌సిక్స్, బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారంటీ లాంటి అనేక హామీలు ఇచ్చి.. వాటిని అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పేరుతో విద్యార్థులకు రూ.15 వేలు, 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తానని అన్ని వర్గాల వారినీ కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్య, వైద్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన అవార్డుల్లో ప్రథమ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు విద్య, వైద్య రంగాలను కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. తిరుమల లడ్డూ భక్తుల మనోభావాలకు చెందిందని, ఈ వివాదాన్ని సీఎం చంద్రబాబు రాజకీయం చేస్తున్నారన్నారు. వంద రోజుల పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి టీడీడీ లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట ఎంపీపీలు రాణా ఈశ్వరమ్మ, రెడ్డి జ్యోతిలక్ష్మి, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, పెనుమజ్జి విష్ణుమూర్తి, మీసాల రామక్రిష్ణ, బైపోతు ఉదయ్‌కుమార్, నాయకులు బి.నారాయణమూర్తి, మద్దు తాతయ్య, చింతాడ సూర్యనారాయణ, జేఏసీ మాజీ కన్వీనర్‌లు ఎనుగుతల సూర్యం, గండివలస ఆనంద్, బురెల శ్రీనివాసరావు, మాదవ్ పుల్లాయ్, పనుకు మోహన్, జోగారావు, రాము పాల్గొన్నారు.

ఆవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



పట్టుకున్న ఆవులు

నరసన్నపేట: పశువుల అక్రమ రవాణాను నరసన్నపేట పోలీసులు అడ్డుకున్నారు. 31 పశువులను నారాయణవలస సంత ప్రాంతం నుంచి అలమండకు ఐచర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు జమ్ము కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం మాటువేశారు. ఐచర్ వ్యాన్‌లో 31 ఆవులను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. వ్యానను సీజ్ చేయగా పశువులను కొత్తవలస గోశాలకు తరిలించినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహంతో పాటు 16 వినాయకుల విగ్రహాల వద్ద శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సంగీత విభావరి అలరించింది. ప్రముఖ గాయకుడు బంకుపల్లి సాగర్ గాత్రం వినిపించగా ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు సత్యనారాయణ శర్మ, బంకుపల్లి దుర్గ శ్రీనివాస్‌శర్మ మృదంగంపై వాయిద్యాన్ని అందించారు.

ఏకగ్రీవంగా ఎంఎంఎస్ కార్యవర్గం ఎన్నిక



ఎంఎంఎస్ అధ్యక్షురాలికి అభినందనలు తెలియజేస్తున్న వెలుగు సిబ్బంది

పొందూరు: పొందూరు మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం జి.శ్యామలరావు అధ్యక్షతన ఎన్నికను నిర్వహించారు. మండలంలోని గ్రామసంఘాల అధ్యక్షులు కలిసి అధ్యక్షురాలిగా కింతలి గ్రామానికి చెందిన పైడి అరుణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొందూరుకు చెందిన బనిశెట్టి కుమారిని ఉపాధ్యక్షురాలిగా, లోలుగు గ్రామానికి చెందిన జడ్డు లక్ష్మిని కోశాధికారిగా, బాణాంకు చెందిన వీవో పెయ్యిల ఆదిలక్ష్మిని కార్యదర్శిగా, కొండాకు చెందిన ముగడ మంగమ్మను సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎంఎస్ అధ్యక్షురాలు అరుణ మట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలను అభివృద్ధిని పథంలో నడిపిస్తానని చెప్పారు. మండలంలో సుమారు 13 ఏళ్లుగా ఎంఎంఎస్ కార్యవర్గం లేదు. ఎట్టకేలకు ఏపీఎం శ్యామలరావు చొరవతో నియామకం జరగడంతో సిబ్బంది అభినందించారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలుగా మణి



నూతన కార్యవర్గం

సరుబుజ్జిలి: మండల మహిళా సమైఖ్య ఎన్నికను వెలుగు కార్యాలయంలో ఏపీఎం కమలకుమారి పాండ్యన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షురాలుగా పేడా మణి, కార్యదర్శిగా ఉరిటి భాగ్యలక్ష్మి, కోశాధికారిగా బడద విజయలక్ష్మి తదితరులను సభ్యులను ఎన్నుకున్నారు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో తిరుమలరావు

పాతపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరెషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలను కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎంఈవో సీహెచ్ తిరుమలరావు ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడా పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ శేఖర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు పీడీ మద్దు తాతయ్య, ప్రధానోపాధ్యాయుడు బి.సింహాచలం పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు



హరిపురంలో సభ నిర్వహిస్తున్న దృశ్యం

బూర్జ: జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయిలను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాయుడు అన్నారు. డొంకలపర్త గ్రామ సచివాలయం పరిధిలోలోని హరిపురం, పల్లాపురం గ్రామాలలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. గిరిజన గ్రామాలకు నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: హెచ్ఐవీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేర్ అండ్ సపోర్టు సెంటర్ ప్రతినిధి నేతల లక్ష్మణ అన్నారు. జమ్ము గ్రామంలో 'మీకు తెలుసా'కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌లపై ప్రజలకుఅవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ రాంప్రసాద్, సిబ్బంది యర్రా చంద్రశేఖర్, ఏఎన్ఎం ఎం. శర్వాణి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు

హిరమండలం: ప్రజలు మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ అన్నారు. గొట్ట గ్రామంలో మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమాలు

మెళియాపుట్టి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో చంద్రకుమారి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చాపరలో జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులతో శుక్రవారం మానవహారం నిర్వహించారు. ప్రజల సహకారంతో స్వచ్ఛ గ్రామాలు సాధ్యమన్నారు. ఈవోపీఆర్డీ తిరుపతి పట్నాయక్, ఎంఈవో దేవేంద్రరావు ఉన్నారు.

జలుమూరు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని జలుమూరు బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావు అన్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి మాట్లాడారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

కొత్తూరు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం విస్మయానికి గురిచేస్తుందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంఘం సభ్యత్వం నమోదు, ఉపాధ్యాయ సమస్యలను శుక్రవారం తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చిన కూటమి నాయకులు ఆ తరువాత పట్టించుకోవడం మనేశారన్నారు. ఇప్పుడు వంద రోజుల పాలనపై సమీక్షలు నిర్వహిస్తున్నారు తప్పా ఉద్యోగ, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించక పోవడం సరికాదన్నారు. పాఠశాల గ్రాంటును విడుదల చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. డేటా ఎంట్రీలతో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతుండగా.. ప్రాథమిక పాఠశాలల పరివేక్షణ అప్పగించడం వింతగా ఉందన్నారు. స్వీపర్లకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఏ మాధ్యమంలో పరీక్షలు రాయాలో ఇంతవరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. 98 రోల్ కంటే తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలలకు గజిటెండ్ హెచ్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. 500 రోల్ ఉన్న ఉన్నత పాఠశాలకు గ్రేడ్-1 హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టైమ్ స్కేల్ వర్తింప చేయాలని, సమగ్ర శిక్షా ఉద్యోగులను ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులకు న్యాయంగ రావాలసిన బకాయిలును చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, హెచ్‌ఎం డీఎల్ నరసింహం, మండల నాయకులు రమణ, పోలినాయుడు, అప్పలస్వామి ఉన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసన్న



తాణేం పాఠశాలలో మాట్లాడుతున్న హరిప్రసన్న

పొందూరు: ఉపాధ్యాయ, ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న డిమాండ్ చేశారు. లైదాం, కొంచాడ, బురిడికంచారం, తాణేం, లోలుగు, తండ్యాం, మలకాం పాఠశాలల్లో శుక్రవారం పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం పాలన 100 రోజులు ముగిసినప్పటికీ ఉద్యోగుల విషయంలో ఐఆర్, పీఆర్సీ ఏర్పాటు, 117 జీవో రద్దుపైనా ఎటువంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమని అన్నారు. పాఠశాలలకు గ్రాంటు మంజూరు చేయకపోవడంతో కరెంటు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సముదాయ సమావేశాలు, సెల్ఫ్ ఎస్సెమెంట్ పరీక్షలు ఏడు రోజుల పాటు నిర్వహించడం, విద్యార్థులకు ఉపయోగం లేని అనవసర కార్యక్రమాలను పాఠశాలల్లో అమలు చేస్తూ బోధన తరగతులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పలు ఆన్‌లైన్ పనులకు వినియోగిస్తున్న ల్యాప్‌టాప్‌లను లాగేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు తమ్మినైన మురళీ మోహన్‌రావు, పొందూరు మండల ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి బాస్కరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గండెం రామారావు పాల్గొన్నారు.

ప్రజల ఆశలను నెరవేర్చుతాం



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి



ఆమదాలవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

నరసన్నపేట: ఏ ఆశలతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టాం కట్టారో వాటిని నెరవేర్చుతామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. వంద రోజుల్లో పలు హామీలు నెరవేర్చామని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కోమర్తిలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వంద రోజుల్లో అమలు చేసిన పథకాలు వివరించారు. ఉద్యోగులకు జీతాలు మొదటి తేదీకే ఇస్తున్నామని, ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు రూ. 4 వేలకు పెంచి అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, జనసేన నాయకులు ప్రవీణ్ కుమార్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సారవకోట: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉద్యోగులకు ఒకటో తేదీకే జీతాలు అందిస్తున్నామని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. గుమ్మపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీపీ కూర్మినాయుడు, ధర్మాన తేజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు, సర్పంచ్ బమ్మిడి నాగరాజు ఉన్నారు.

పింఛన్ పెంచి అందిస్తున్నాం

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్లను పెంచి అందజేస్తున్నామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి పదో వార్డు వాంబేకాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు.

బూర్జ: మండల కేంద్రం బూర్జ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో యు.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బలివాడ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యుడు చొక్కర పోలినాయుడు, సూరి గిరిబాబు వద్దాది బోగిరాజు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: బొత్తాడసింగి, బొర్రంపేట గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు అంపిలి పోలినాయుడు, కోవిలాపు కృష్ణమాచారి పాల్గొన్నారు.